
# మానిషాద

—సి.హెచ్. ఇంద్రాణి



బజారు నుంచి లోపల కొన్తున్న సుబ్బారావు "బామ్మా" ఆ సుత్తిలా పట్రావే" అని అరిచాడు. సంచిలోంచి తను తెచ్చిన లెటర్ బాక్స్‌ను బయటకు తీశాడు. బామ్మతెచ్చిన సుత్తితో పక్క వాటా పిల్లలకు అందకుండా కొంచెం ఎత్తుగా ఓ మేకు కొట్టి దాన్ని తగిలించాడు. ఆ లెటర్ బాక్స్ వల్ల ఇప్పుడు ఆవరండాకే ఒక కొత్త కళవచ్చింది.

"సార్.... పోస్ట్"... పోస్టమేన్ ఓ శుభలేఖను అలవాటు ప్రకారం వరండాలో విసిరేసి బయటకు వెళ్ళి పోతున్నాడు.

సుబ్బారావుకి అరికాలిమంట నెత్తికెక్కింది. చెట్టంత మనిషి తనక్కడ ఉన్నాడని చూసి కూడా అలావిసి రేసి వెళ్ళి పోతాడా? అదీగాక ఆరోజే తను పది రూపాయలు పెట్టి ఓ లెటర్ బాక్సుకొని అందంగా ఫిక్స్ చేశాడు. దాన్ని కూడా ఖాతరు చెయ్యకుండా వెళ్ళిపోతాడా?.... ఎక్కడో అహం దెబ్బ తిన్నది సుబ్బా రావుకు. వెంటనే

"అయ్యా పోస్టమాన్‌గారూ ఇలారండి"... పిలిచాడు సగం హేళనగా. అన్ని ఉత్తరాలూ సరఫరాచేసి అసలే అర్జెంటుగా ఇంటి కెళ్ళాలనుకున్న పోస్టమాన్ సుబ్బారావు పిలుపు విని కొంచెం విసుగుతోనే సైకిలుకు స్టాండువేసి గేటు తెరుచుకుంటూ లోపలకు వచ్చాడు.

"ఏంటి సార్... పిలిచారు"

"ఇదిగో చూడండి... ఇవాళ్టి నుంచి ఉత్తరాలు ఈ లెటర్ బాక్స్‌లో వెయ్యాలి తెల్సిందా? 'సార్ పోస్ట్' అంటూ అరుస్తూ అలా గిరాటెయ్యకూడదు." అని గట్టిగా ప్రైవేటు చెప్పేశాడు సుబ్బారావు, ఎమ్ఏ.బి.ఇడి.

"సరే" అన్నాడు పోస్టమాన్.

సుబ్బారావు శుభలేఖ ఎవరిదా అనుకుంటూ యాంత్రికంగా బయటకు తీశాడు. హైదరాబాదులో తనతో ఎమ్.ఏ. చదివిన కృష్ణారెడ్డి పెళ్ళి. వెళ్ళి తీరాలి. అందులోనూ క్లాస్‌మేటు, రూంమేటు కూడా. అదీగాక వాళ్ళ నాన్నకు అక్కడ ప్రభుత్వంలో కొంచెం పరపతి కూడా ఉంది. తను ఇప్పటి దాకా నాలుగైదు ఇంటర్వ్యూలు అటెండు అయ్యాడు. ఎలాగైనా ఓ జూనియర్ కాలేజ్‌లోనో, హైస్కూలులోనో ఉద్యోగం సంపాదించి సెటిల్ అయిపోవాలి అనుకొని కృష్ణుడిని చూడడానికి బయలుదేరిన కుచేలుడిలా బయలుదేరాడు సుబ్బారావు.

పెళ్ళికి రెండు రోజుల ముందే వెళ్ళి పెళ్ళి పందిట్లో అన్ని పనులూచేసి మిత్రుడితోపాటు అతని తల్లిదండ్రుల ఆప్యాయతను రెండింతలు పొందాడు. తద్వారా తన ఆశయాన్ని సాధిద్దాం అనుకున్న అతని ప్లాను ఒకవిధంగా సక్సెస్ అయిందనే చెప్పాలి. పెళ్ళయిం తర్వాత తన మిత్రుడు హానీమూన్‌కు వెళ్ళగానే అతని తండ్రిగారిని కొందరు పెద్ద మనుమలను చూసి తన పోస్టింగ్ గురించి మాట్లాడి వచ్చాడు.

కొండంత ఆశతో ఇంటికి వచ్చిన సుబ్బారావుకు ఇంట్లో ఇంకో శుభవార్త కాచుకొనివుంది. గ్రామంలో తన బాబాయి కూతురి పెళ్ళి. మూటముల్లె సర్దుకుని బామ్మతో ప్రయాణమయ్యాడు సుబ్బారావు. ఇలా ఓ నెలరోజులు గడిచింది.

ఇంటికొచ్చిన సుబ్బారావు తన ముద్దుల లెటర్ బాక్స్ వంక చూశాడు. అందులో ఓ మగ, ఓ ఆడ పిచ్చుకల జంట హాయిగా కాపురం పెట్టాయి. స్నానం చేసొచ్చి తన ప్రియమైన లెటర్ బాక్స్‌ను శుభ్రం చెయ్యటానికి సంసిద్ధుడయ్యాడు సుబ్బారావు. ఇంతలో వాళ్ళ బామ్మ "ఒరేయ్... నిక్షేవంలాంటి గూడును పీకి పాపంకట్టుకోకురా!" అంది వెనక నుంచి.

"పోవే బామ్మా... నువ్వూ నీ చాదస్తం" అంటూ

కొద్దిగా గడ్డిని పీకాడు సుబ్బారావు. లోపల నుండి ఓ చిన్న పిచ్చుక గుడ్డు కిందపడి పగిలిపోయింది. ఇంకో రెండు మూడు గుడ్లు అటూఇటూ దొర్లి పడబోతూ వుంటే పట్టుకుని లోపలికి తోశాడు సుబ్బారావు. అసలే జాలిగుండె మనిషి... అతని మనస్సు కరిగిపోయింది. ఓ ప్రాణి చావటానికి తనుకారకుడయ్యాడు. బాధతో సుబ్బారావు ఇక లెటర్ బాక్స్ జోలికి పోలేదు. దూరం నుంచి ఇదంతా గమనిస్తున్న ఆ పిచ్చుక జంట సుబ్బారావును దీవించింది.

ఓ వారం పదిరోజులలో కిచకిచ ధ్వనులు, కిలకిల రావాలు ఎంతో ముద్దుగా వినిపించాయి సుబ్బారావుకు. పెద్ద పిచ్చుకల జంట తమ పెరట్లోని అన్నంమెతుకులు ఏరటం తమ పిల్లల నోట్లో పెట్టటం చూస్తుంటే సుబ్బారావుకు ప్రకృతిలోని ఏవో క్రొత్త అందాలు స్ఫురించాయి. బహుశ ఇలాగే కాకపోయినా ఒక విధంగా తననూ తన తల్లి దండ్రులు ఈవిధంగానే ప్రేమతో పోషించి ఉంటారుగదా, అనిపించిన సుబ్బారావుకి అప్రయత్నంగా కన్నీళ్లు వచ్చాయి.

ఆరోజు సుబ్బారావు ఈజీ చెయిర్‌లో పడుకొని తన భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నాడు. తల్లి పిచ్చుక వరండా ఎదురు గోడమీద నుంచి కిచకిచ అరుస్తున్నది. పిల్లలు లెటర్ బాక్స్‌లో నుంచి జవాబిస్తున్నట్లుగా అరుస్తున్నాయి. కాసేపటిలో ఓచిన్న పిచ్చుక పిల్ల మెల్లగా భయపడుతూ ఎగిరింది.... ఆశ్చర్యం. ఎంతో విజయవంతంగా తల్లిని చేరుకుంది. "ఆహా ప్రకృతిలోనే దేవుడు అన్ని జీవరాసులకూ తగిన శక్తిని ప్రసాదిస్తాడు గాబోలు"..... అనుకుంటూ వుండగానే రెండో పిల్ల కూడా బయటికి దూకి తల్లిని చేరుకోలేక కిందవాలిపోయింది. అప్రయత్నంగా లేచాడు సుబ్బారావు.

దగ్గరికి వస్తున్న సుబ్బారావును చూసి ఆ పిల్ల తన శక్తినంతా కూడగట్టుకొని మళ్ళీ లేచిఎగిరి తల్లిని చేరుకుంది. ఇంతలో మూడో పిల్ల భయపడుతూనే అరవడం మొదలుపెట్టింది. దాన్ని చూస్తున్న సుబ్బారావుకు షేక్స్‌పియర్ రాసిన "టుబి ఆర్ నాట్ టుబి" అన్న సన్నివేశం మనసులో మెదిలింది. బయటి ప్రపంచంలోకి మొట్టమొదటిసారిగా అడుగు పెట్టబోతున్న ఆ పిచ్చుక పిల్లను చూస్తే గీతోపదేశానికి కారకుడయిన అర్జునుడిలా అనిపించింది. ఒకవిధంగా తనూ ఈరోజు ఆ పరిస్థితులలోనే ఉన్నాడు. జీవితాన్ని ఎక్కడ ఎలా మొదలు పెట్టాలో తెలీకుండా ఉన్నాడు.

బయటకు వచ్చిన పిల్ల ఎందుకో జంకి వెళ్ళి గూట్లో దాక్కుంది. వెంటనే బయట ఉన్న రెండు పిచ్చుక పిల్లలు గూట్లోకి దూరాయి. కాసేపట్లో కిచకిచ ధ్వనులతో మూడు పిచ్చుకలూ ఎగిరి వరండాలో తిరగటం మొదలుపెట్టాయి. ఆనందంతో గంతులు వేస్తున్న ఆపిచ్చుక పిల్లలతో పాటు సుబ్బారావు హృదయం కూడా ఎందుకో గంతులు వేసింది. గబగబా లోపలికెళ్ళి కెమెరాతెచ్చి ఆ మూడు పిచ్చుకల్ని ఫోటో తీశాడు.

కానీ ఆ ఆనందం రెండుమూడు రోజులలో మాయం అయింది. తన లెటర్ బాక్స్ గూడును వదిలి ఆ పిచ్చుకల సంసారం ఎక్కడికో ఎగిరి పోయింది. ఆ గూడు ఖాళీ అయిపోయింది.

ఆరోజు ఆదివారం పనేమీ లేకపోతే ఆ పోస్ట్ బాక్స్‌ను తీసి శుభ్రం చెయ్యటానికి ఉపక్రమించాడు సుబ్బారావు. గడ్డి, గాదం, పుల్లలు, దూది, ఎండిపోయిన పిచ్చుక రెట్టలు తీసేశాడు సుబ్బారావు. అప్పుడు లోపలేదో చేతికి తగిలింది. తీసి చూడగానే గతుక్కుమన్నాడు సుబ్బారావు.

అదేదో గవర్నమెంటు కవరు. విప్పిచూస్తే అపాయింట్ ఆర్డర్. డ్యూటీలో చేరవలసిన ఆఖరు తేదీ దాటి పదిహేను రోజులు పైన కావస్తున్నది. ఇదేదో నెలరోజుల క్రితం వచ్చిన కవరు. ఈపిచ్చుకల గొడవలో అన్యాయంగా తన జీవితం బలైపోయింది. తనుచూపిన భూతదయ ఇప్పుడే భూతం అయి తనకే ఎదురు తిరిగింది. ఆరోజంతా అప్‌సెట్ అయిపోయాడు. అపాయింట్‌మెంటు లెటర్‌ను దాదాపు అరవైసార్లు చదివి ఉంటాడు. ఆ రాత్రంతా నిద్రపట్టలేదు సుబ్బారావుకు. మర్నాడు వెళ్ళి ఆ జూనియర్ కాలేజీ వారిని చూసి జరిగింది చెప్పాలనుకున్నాడు.

తెల్లవారింది. సుబ్బారావు ఎనిమిదిన్నరకే జూనియర్ కాలేజీకెళ్ళాడు. ఇంకా ఎవరూ రాలేదు. పదకొండు గంటలకు వచ్చిన ప్రిన్సిపాల్‌ను మీట్ అయితే 'అంతకు ముందుటి శుక్రవారమే వేరెవరినో, అపాయింట్ చేశాము.... అయినా ఆమాత్రం వంక్చువాలిటి లేనివాళ్ళు పిల్లలకు పాఠాలు ఏం చెప్పగలరు?' అదీ ఇదీ అని తనకే పాఠాలు చెప్పాడు. బిక్క మొఖంతో ఇంటి ముఖం పట్టాడు సుబ్బారావు.

* * *

ఎ.సి. రూంలో లామినేట్ చేసి గోడకు అమర్చిన కలర్ ఫోటోనే చూస్తున్నాడు సుబ్బారావు. అది అతను ఇదివరకు తీసిన మూడు పిచ్చుకల ఫోటో. ఎన్‌లార్జి చేసి తన ఆఫీను రూంలో పెట్టుకున్నాడు. పదేళ్ళనాటి సంగతి... నిన్న జరిగినట్లుంది.

* * *

"ఇదుగోనోయ్ సుబ్బారావు నువ్విచ్చిన రీలు. ఫోటోలు చాలా బాగా వచ్చాయి. .అన్నిటి కన్నా ఆ మూడు పిచ్చుక పిల్లల్ని తీశావే అది సూపర్బ్" అంటూ తనను మెచ్చుకున్నాడు ఫోటో స్టూడియో రామారావు.


సుబ్బారావు అప్రయత్నంగా ఆఫోటో చూశాడు. ఆరోజు తన వరండాలో జరిగిందంతా జ్ఞాపకం వచ్చింది. ఆ పిచ్చుకల కళ్ళల్లో ఎంత కాన్ఫిడెన్సు. తనలాగా వయస్సు లేదు, డిగ్రీలేదు. సొంత ఇల్లులేదు. ఏంచూసుకుని వాటికి ఆ ధైర్యమో తనకు అర్థం కాలా... కానీ తనే... అన్నీ ఉన్నా ఇంకా ఆ బానిస ఉద్యోగం పోయిందని బాధపడుతూ తన జీవితాన్ని సర్వనాశనం చేసుకుంటున్నాడు. ఆ ఫోటోనే చూస్తున్న సుబ్బారావు కేదో తళుక్కున మెరిసింది.

ఆరోజే ఆఫోటోను ఎన్‌లార్జి చేయించి గోడకు తగిలించాడు - ఏకలవ్యుడు ద్రోణుడి విగ్రహాన్ని పెట్టుకున్నట్లు —

ఆరోజు నుంచి ఇరుగు పొరుగు పిల్లలకు ట్యూషన్‌లు చెప్పటం మొదలుపెట్టాడు. త్వరలో ఓ చిన్న స్కూలుగా తయారయి ట్యూటోరియల్ కాలేజీ అయి ఆ ఊరికే ఓ పెద్ద రెసిడెన్షియల్ స్కూలుగా తయారయింది. ఎంతోమంది, డాక్టర్లు, ఇంజనీర్లు, ఐ.ఎ.ఎస్. ఐపియస్ ఆఫీసర్లు ఇక్కడే ఎంట్రన్సు ఎగ్జామినేషన్‌కు ట్రెయినింగ్ తీసుకున్నారు.

* * *

ఆబానిస బతుకు నుంచి తప్పించి ఇంతటి స్వతంత్ర జీవితం ఇచ్చి తనను వృద్ధిలోనికి తెచ్చిన ఆ మూడు పిచ్చుకల ఫోటో కృతజ్ఞతతో చూస్తున్న సుబ్బారావు కళ్ళలో కన్నీరు మెదిలింది.అవి ఆనంద బాష్పాలే అనివేరే చెప్పాలా.




ప్రతి ధ్వనికీ ప్రతిధ్వని ఏది?
ప్రతి ప్రతిధ్వనికీ ధ్వని ఏది?

బిచ్చగాని ఆర్తనాదానికీ
క్షుదార్తుని విలాపానికి
అశక్తుని క్రోధానికీ
నియంతల శాసనానికి
ప్రతిధ్వని ఏది?

తల్లిని చూసిన పసిపాప
బోసినవ్వు వెన్నెలకీ
శ్రీవారిని చూసిన క్షణాన
నవ వధువు సంతోషానికీ
రుణదాతను చూసిన పేద
గుమాస్తా ముఖాన భయానికీ ధ్వని ఏది?

జీవంలేని రాతిలో ప్రతిధ్వని ఉంది
గుండె కొట్టుకోవడం గొంతులో ప్రతిధ్వనిస్తోంది

సంతోషానికి, సంకోచానికి
ప్రతిధ్వని ఉంటే
సందేహానికి ఉందా ప్రతిధ్వని?

ఆసక్తికి ప్రతిధ్వని ఆనందంఐతే
నిరాసక్తికి ఏది ప్రతిధ్వని?

విద్యార్థుల అలజడికీ
విచ్చలవిడి తనానికీ
ఉంది ప్రతిధ్వని
మరి విరహానికి
ఉందా ప్రతిధ్వని?

నిరాశకి
నిస్త్రాణకి
నిజానికి
ధ్వని ఏది?

ప్రళయానికి
ప్రణయానికి
ప్రణవానికి
ప్రతిధ్వని ఏది?

అందుకే అన్నాను
ప్రతి ధ్వనికీ ప్రతిధ్వని ఉండదు,
ప్రతి ప్రతిధ్వనికీ ధ్వని ఉండదని.

— వి.సుచిత్రా మౌళి